కండ్లముందే కృష్ణమ్మ ఖాళీ

7 నెలల్లో 594 టీఎంసీలు మళ్లించిన ఏపీ • పోతిరెడ్డిపాడు ద్వారానే 220 టీఎంసీలు • తెలంగాణ వాడుకున్నది 170 టీఎంసీలే • ఏపీని కట్టడి చేయని రేవంత్ సర్కార్ • సమృద్ధిగా నీళ్లొచ్చినా ఒడిసిపట్టని నిర్లక్ష్యం

కల్వకుర్తి, భీమా, జూరాల ఆయకట్టుకూ కోత.. • భీమా ప్రాజెక్టు పరిధిలోనూ క్రాప్ హాలిడే • నీటి వినియోగంపై సోయి లేని ప్రభుత్వం • ఇప్పుడు టెలీమెట్రీలు అంటూ హడావుడి • నేడు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు మీటింగ్

(మ్యాకం రవికుమార్)

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ) : ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిశాయి. రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కన్నా 97 శాతం అత్యధిక వర్షపాతం నమోదైంది. కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ పొంగిపొర్లాయి. ఆపై ఏకంగా 844 టీఎంసీల జలాలు సముద్రానికి తరలిపోయాయి. కృష్ణా నదీజలాల్లో ఏపీ తాత్కాలిక కోటా 512 టీఎంసీలే కాగా ఇప్పటివరకు ఏకంగా 594.14 టీఎంసీలను మళ్లించుకున్నది. సర్దుబాటు కోటాకు మించి 16 శాతం మేరకు జలాలను తరలించుకుపోయింది. అదీ కేవలం 7 నెలల్లోనే. అందులోనూ ఒక్క పోతిపాడురెడ్డి హెడ్ రెగ్యులేటరీ ద్వారానే 220 టీఎంసీలను పెన్నాబేసిన్‌కు బాజాప్తా మళ్లించింది. అదే సమయంలో కృష్ణమ్మను ఒడిసిపట్టుకుండా రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు చేతులెత్తేసింది. తాత్కాలిక కోటా జలాలను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలనే సోయికూడా రేవంత్ సర్కారుకు లేకుండా పోయింది. తాత్కాలిక కోటా జలాల్లో 56.85 శాతం అంటే కేవలం 170 టీఎంసీల కృష్ణా జలాలనే వినియోగించింది. మరోవైపు ప్రాజెక్టుల్లో సరిపడా నీళ్లు లేవంటూ సాగర్ మినహా ఉమ్మడి పాలమూరు జిల్లా ఆయకట్టును పడావు పెట్టింది. నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకొనేందుకు ఇప్పుడేమో టెలీమెట్రీ లంటూ హడావుడి చేస్తున్నది. ఏపీని కట్టడం చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇంతకాలం చోద్యం చూసి ఇప్పుడేమో నీటి పారకాన్ని కొలిచేందుకు టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలంటూ హడావుడి చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఒక్క పోతిరెడ్డిపాడు నుంచే 220 టీఎంసీలు..

ఈ ఏడాది అక్టోబర్ మాసాంతంవరకు కూడా ఎగువ నుంచి కృష్ణాలో వరద ప్రవాహాలు కొనసాగాయి. అక్టోబర్ 25 నాటికి శ్రీశైలం రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటి నిల్వ మట్టం 885 అడుగులకు చేరుకోగా, 215 టీఎంసీలతో కళకళలాడింది. పలుమార్లు క్రెస్ట్ గేట్లను ఎత్తేశారు. కానీ నెల తిరిగేసరికి పరిస్థితి మొత్తం తారుమారింది. ఇంకా యాసంగికి సంబంధించి నీటి విడుదల ప్రారంభం కాకుండానే శ్రీశైలం రిజర్వాయర్‌ను ఏపీ సర్కారు ఖాళీ చేసింది. నెల వ్యవధిలోనే 93 టీఎంసీలను పోతిరెడ్డిపాడు (పీఆర్‌పీ) హెడ్ రెగ్యులేటరీ నుంచి ఏపీ నిరంతరాయంగా కృష్ణా జలాలను తరలించింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఒక్క పోతిరెడ్డిపాడు ద్వారానే 7 నెల్లోనే 220 టీఎంసీలకు పైగా జలాలను పెన్నా బేసిన్‌కు మళ్లించింది. ప్రస్తుతం పెన్నా బేసిన్‌లో దాదాపు 350 టీఎంసీల మేరకు జలాలను నిల్వ చేసింది. అవిగాకుండా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, జీఎన్‌ఎస్‌ఎస్, ముచ్చుమర్రి, మల్యాల తదితర ఎత్తిపోతల ద్వారా కూడా జలాలను తరలించింది. దిగువన నాగార్జునసాగర్ వద్ద కూడా కుడికాలువ, పంప్‌హౌస్ ద్వారా కృష్ణా జలాలను ఏపీ నిరంతరాయంగా తరలిస్తూనే ఉన్నది. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు 594 టీఎంసీలకు పైగా జలాలను ఏపీ పెన్నా బేసిన్‌కు తరలించినట్టు అధికారిక గణాంకాలే తేటతెల్లం చేస్తున్నాయి. పీఆర్‌పీ నుంచి ఏపీ నీటి తరలింపుతో ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటినిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి.

నీటి వినియోగంలో రేవంత్ సర్కార్ ఘోర వైఫల్యం

శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్ల నుంచి ఎంతమేరకు సాధ్యమైతే అంతమేరకు కృష్ణా జలాలను తరలిస్తూ, రిజర్వాయర్లను ఏపీ ప్రభుత్వం నింపుకుంటుండగా తెలంగాణ సర్కారు మాత్రం మొద్దు నిద్ర పోతున్నదని నీటిరంగ నిపుణులు మండిపడుతున్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద రిజర్వాయర్లను, కాలువలతో అనుసంధానించిన వందలాది చెరువులను నింపే అవకాశమున్నా తెలంగాణ సర్కారు ఆ పనిచేయని దుస్థితి నెలకొన్నది. కల్వకుర్తి పంపింగ్ స్టేషన్‌లో మొత్తం 5 పంపులుండగా, కేవలం 3 మాత్రమే పనిచేస్తున్నాయి. మిగతా 2 పంపులకు మరమ్మతులు చేయకుండా ఏడాదిగా నిర్లక్ష్యంగా చేస్తూ వచ్చింది. అక్కడ పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు జలాలను ఎత్తిపోసుకోలేని దుస్థితి నెలకొన్నది. కల్వకుర్తి, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, రాజీవ్‌భీమా, జూరాల ఇతర మీడియం ప్రాజెక్టులతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2645 చెరువులను, చెక్‌డ్యామ్‌లను అనుసంధానం చేసింది. జలాలను లిఫ్ట్ చేసి ఆయా చెరువులను, చెక్‌డ్యామ్‌లను నింపే అవకాశమున్నా కాంగ్రెస్ సర్కారు ఆ పనిచేయలేదు. ఇక సాగర్ ఎడమ కాలువ పూర్తిస్థాయి సామర్థ్యం 8 వేల క్యూసెక్కులు కాగా ఈ ఏడాది ఇప్పటికి గరిష్ఠంగా 6 వేల క్యూసెక్కులకు మించి నీటిని విడుదల చేయడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అదీగాక ఎడమ కాలువతో అనుసంధానించిన చెరువులను నింపే అవకాశమున్నా కూడా ప్రభుత్వం ఆ పని చేయడం లేదని రైతాంగం మండిపడుతున్నది. ఏపీని కట్టడి చేయడంలోనే కాదు కృష్ణా జలాలను ఒడిసిపట్టే అంశంలోనూ తెలంగాణ సర్కారు అడుగడుగునా విఫలమైంది. మరోవైపు సరిపడా సాగునీరు లేక ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టుల కింద యాసంగిలో ఆయకట్టును పడావుపెట్టింది.

'పాలమూరు'పై సోయిలేని సర్కారు..

పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై కాంగ్రెస్ సర్కారు పూర్తిగా శీతకన్ను వేసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకానికి రూపకల్పన చేసింది. ప్రాజెక్టులో భాగంగా అంజనగిరి (నార్లాపూర్) 8.51 టీఎంసీలు, వీరాంజనేయ (ఏదుల) 6.55 టీఎంసీలు, వెంకటాద్రి (వట్టెం) 16.74 టీఎంసీలు, కురుమూర్తిరాయ (కరివేన) 17.34 టీఎంసీలు, ఉద్దండాపూర్ 16.03 టీఎంసీలు, కేపీ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్లను 2.80 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించాలని నిర్ణయించింది. రాష్ట్ర ఏర్పాటు నాటికి కృష్ణా బేసిన్‌లో మొత్తం తెలంగాణ నీటి నిల్వ సామర్థ్యం 8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం నిర్మిస్తున్న ఒక్క పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోనే 67.97 టీఎంసీల నిల్వసామర్థ్యం పెరగనుంది. ఇప్పటికే కేపీ లక్ష్మీదేవిపల్లి మినహా మిగతా రిజర్వాయర్లన్నీ పూర్తయ్యాయి. నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి ఏదుల రిజర్వాయర్‌కు జలాల తరలింపునకు 8.5 కిమీ మీటర్ల కాలువ తవ్వాల్సి ఉండగా, కాంగ్రెస్ సర్కారు ఏర్పడే నాటికే 4.5 కిలోమీటర్ల కాలువ పనులు పూర్తయ్యాయి. 3.5 కిలో మీటర్ల తవ్వకం పని మిగిలి ఉన్నది. ఆ పనులను ఏడాదిగా కాంగ్రెస్ సర్కారు పడావు పెట్టింది. ఆ ఒక్క కెనాల్ పనులు పూర్తి చేస్తే నార్లాపూర్ నుంచి కరివెన వరకు కృష్ణా జలాలను తరలించే అవకాశమున్నది. అందుకు సంబంధించిన పనులన్నీ గతంలోనే పూర్తయ్యాయి. సర్కారు ఏమాత్రం పనులు చేసినా ఆయా రిజర్వాయర్లలో నీటిని నిల్వ చేసుకునే వెసులుబాటు కలిగేది. తత్ఫలితంగా వాటి పరిధిలో భూగర్భజలాల పెరుగుదలకు అవకాశముండేది. కానీ సర్కారు మాత్రం ప్రాజెక్టును ఏడాది నుంచి పూర్తిగా విస్మరించింది.

టెలీమెట్రీలంటూ ఇప్పుడు హడావుడి

పోతిరెడ్డిపాడు నుంచి ఏపీ సర్కారు యథేచ్ఛగా కృష్ణా జలాలను బేసిన్ అవతలికి తరలిస్తున్నా కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) చోద్యం చూస్తూ కూర్చున్నది. నీటి తరలింపును నిలిపేయాలని పేరుకే లేఖలు రాసి చేతులు దులుపుకొన్నది. అయినా ఏపీ సర్కారు పోతిరెడ్డిపాడు నుంచి నిరంతరాయంగా నీటిని మళ్లిస్తున్నది. ఆదేశాలను బేఖాతరు చేస్తున్నా తెలంగాణ సర్కారు మాత్రం చోద్యం చూస్తూ ఉండిపోయింది. బోర్డుపై ఒత్తిడి తెచ్చి కృష్ణా జలాలను ఏపీ తరలించకుండా అడ్డుకునేందుకు ఎలాంటి ప్రయత్నమూ చేపట్టలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. శ్రీశైలం ప్రాజెక్టునే కాదు దిగువ సాగర్ వద్ద కూడా ఏపీ ఆడింది ఆటగా, పాడింది పాటగా కొనసాగుతున్నది. ఎలాంటి ఇండెంట్ పెట్టకుండానే, ఈ సీజన్‌లో ఇప్పటికీ నీటి వాటాల పంపిణీ పూర్తి కాకముందే కుడికాలువ ద్వారా సామర్థ్యం మేరకు జలాలను తరలించుకుపోతున్నది. అదీగాక నీటి ప్రవాహాల రీడింగ్‌ను సైతం నమోదు చేయకుండా అడ్డుకుంటున్నది. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ సర్కారు మాత్రం పట్టనట్టుగానే వ్యవహరిస్తున్నది. ఈ నీటి సంవత్సరానికి సంబంధించి కోటాలపై సమావేశాన్ని నిర్వహించాలని బోర్డును ఇప్పటివరకు పట్టుబట్టకపోవడం సర్కారు నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది. ఇంతకాలం నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాష్ట్ర సర్కారు ఇప్పుడేమో పీఆర్పీపై నీటి పారకాన్ని కొలిచేందుకు టెలీమెట్రీలను ఏర్పాటు చేయాలంటూ హడావుడి మొదలుపెట్టడం గమనార్హం. ఇంతకాలం మొద్దునిద్రలో ఉన్న రేవంత్ సర్కారు ఇప్పుడు టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలని హడావుడి చేస్తుండడంపై ఇంజినీరింగ్ నిపుణులు సైతం మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే సాధ్యమైనంత మేరకు చెరువులు నింపాలని, నీటివినియోగంపై దృష్టి సారించాలని రైతులు, సాగునీటిరంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు. జలాలను ఇష్టారాజ్యంగా తరలించుకోకుండా ఏపీని నిలువరించేందుకు బోర్డుపై, కేంద్రంపై ఒత్తిడి తేవాలని, లేదంటే మళ్లీ గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

నేడు కృష్ణా బోర్డు సమావేశం

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) మీటింగ్ నేడు కొనసాగనున్నది. ఈ మేరకు ఇరు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ అధికారులు సమాచారం ఇచ్చారు. వాస్తవంగా బోర్డు సమావేశాన్ని నవంబర్‌లోనే నిర్వహించాలని తొలుత ఖరారు చేశారు. ఎజెండా అంశాలను పంపాలని కోరుతూ తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు లేఖ రాసింది. అయితే ఒక పర్యాయం ఏపీ, అటు తర్వాత తెలంగాణ ప్రభుత్వాలు సమావేశాన్ని వాయిదా వేయాలని కోరడం, కేఆర్ఎంబీ ఆ మేరకు వాయిదా వేయడం పరిపాటిగా మారింది. ఎట్టకేలకు నేడు సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ప్రస్తుతం శ్రీశైలం, సాగర్ కామన్ రిజర్వాయర్లలో కలిపి మొత్తం 160 టీఎంసీలే వినియోగానికి అందుబాటులో ఉన్నాయి. ఇదిలా ఉంటే నాగార్జునసాగర్ ఎడమ కాలువ జోన్ 3లోని ఆయకట్టుకు 12 టీఎంసీల జలాలు విడుదల చేయాలని ఏపీ సర్కారు ఇటీవల కేఆర్ఎంబీకి సమాచారమిచ్చింది. తెలంగాణ మాత్రం ఇప్పటివరకు నీటి ఇండెంట్‌ను పెట్టకపోవడం గమనార్హం. ఇక బోర్డు సమావేశంలో నీటివాటాలతోపాటు, రెండోదశ టెలీమెట్రీల ఏర్పాటు, ఆపరేషన్ ప్రోటోకాల్ తదితర అంశాలపై నేటి సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయి.

కృష్ణాజలాలు

ఈ ఏడాది సముద్రంలో కలిసినవి **844.49** టీఎంసీలు	ఏపీ వినియోగించుకున్న జలాలు **594.14** టీఎంసీలు (116.04శాతం)
ఇరు రాష్ట్రాలు వినియోగించుకున్నవి **764.14** టీఎంసీలు	తెలంగాణ వినియోగించుకున్నవి **170** టీఎంసీలు (56.85శాతం)

2025-26 నీటి సంవత్సరానికి సంబంధించి 7 నెలల్లో కృష్ణా జలాల వినియోగం

ఏపీ మళ్లించుకుపోయినవి

శ్రీశైలం రిజర్వాయర్‌లో..

బౌట్‌లెట్	టీఎంసీల్లో
చెన్నై వాటర్ సప్లయ్	1.78
హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్	21.40
పీఆర్పీ (పోతిరెడ్డిపాడు)	220
ముచ్చుమర్రి లిఫ్ట్	0.5
నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో	
ఎన్ఎస్పీ లెఫ్ట్ కెనాల్	18.70
ఎన్ఎస్పీ రైట్ కెనాల్	130
కృష్ణా డెల్టా సిస్టమ్	136
గుంటూరు చానల్	0.76
తుంగభద్ర డ్యామ్ నుంచి..	
హెచ్ఎల్‌సీ	24
లోలెవల్ కెనాల్	11
కేసీ కెనాల్	30
మొత్తం	594.14

తెలంగాణ వినియోగించుకున్నవి

బౌట్‌లెట్	టీఎంసీల్లో
శ్రీశైలం	
కల్వకుర్తి లిఫ్ట్	26
చెన్నై వాటర్‌సప్లయ్	0.84
నాగార్జునసాగర్‌లో	
హెచ్ఎండబ్ల్యూఎస్	8.82
ఏఎమ్మార్పీ	26.46
ఎన్ఎస్పీ లెఫ్ట్ కెనాల్	66.505
తుంగభద్ర నుంచి..	
ఆర్డీఎస్	4.47
జూరాల	14.25
నెట్టెంపాడు	6.25
భీమా	6.56
కోయిల్‌సాగర్	2.37
మొత్తం	162.52

నోట్: అన్ని మీడియం ప్రాజెక్టుల కింద కలిపి మరో 8 టీఎంసీల వినియోగం. నికరంగా ఏడాదిలో ఇప్పటివరకు 299 టీఎంసీల వాటాలో తెలంగాణ వాడుకున్నది 170 టీఎంసీలే. (56.85 శాతమే)

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రధాన ప్రాజెక్టుల వారీగా నీటి వినియోగం

ప్రాజెక్టు	కేటాయింపులు	2013-14 నాటికి సగటు వినియోగం	స్వరాష్ట్రంలో సగటు వినియోగం	ఈ ఏడాది వినియోగం
జూరాల	17.84	15.9	15.9	14.39
కోయిల్‌సాగర్	3.9	1.8	3.5	2.37
రాజీవ్‌భీమా	20	0.5	15	6.54
నెట్టెంపాడు	22 (ఫ్లడ్)	0	20	6.25
ఆర్డీఎస్	15.90	1.6	5.6	4.47
కల్వకుర్తి	25 (ఫ్లడ్)	0	35	26
మొత్తం	104.64 టీఎంసీలు	19.8టీఎంసీలు (18.92 శాతం)	95 టీఎంసీలు (90 శాతం)	60.02 టీఎంసీలే

కేఆర్ఎంబీ కార్యాలయాన్ని తరలించాలి

ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయాన్ని విజయవాడకు తరలించాలని, ఆ దిశగా బోర్డు చర్యలు తీసుకోవాలని ఏపీ సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు కోరారు. ఈ మేరకు హైదరాబాద్ జలసౌధలో కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్ జైన్‌ను సోమవారం ప్రత్యేకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. బోర్డు కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని గత వైసీపీ సర్కార్ ప్రతిపాదనను పునఃసమీక్షించాలని కోరారు. నాగార్జునసాగర్ నుంచి మూడో జోన్‌కు నీటిని విడుదల చేయించి పంటలను రక్షించాలని డిమాండ్ చేశారు. కృష్ణా జలాల్లో గతంలో మాదిరిగానే ఏపీకి 512 టీఎంసీల వాటాను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సాగర్ కుడి కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, యార్లగడ్డ రవిబాబు, కొమ్మారెడ్డి రాజేశ్, దేవినేని సత్యనారాయణ, పామర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొదలు వదిలి తోకపై గురి

బ్రహ్మపుత్ర- మహానది-గోదావరి అనుసంధానం ఊసెత్తని మోదీ సర్కారు

తమిళ నాట రాజకీయాల కోసం గోదావరి మళ్లింపునకు హడావుడి

- **తెలంగాణ మీదుగా హక్కు జలాలనూ తరలించుకుపోయేందుకు ప్రణాళికలు**
- **గోదావరి-కావేరి అనుసంధానంపై వేగంగా పావులు కదుపుతున్న కేంద్రం**
- **ఎంవోయూలకు సిద్ధమవుతున్న వైనం**
- **తెలంగాణకు పొంచి ఉన్న ముప్పుపై అప్రమత్తంకాని కాంగ్రెస్ ప్రభుత్వం**

నీటి కుట్రలు.. మళ్లీ మొదలు

హైదరాబాద్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): గోదావరిలో మిగులు జలాలు లేవని ట్రిబ్యునల్ ఏనాడో తేల్చిచెప్పింది. ఎన్‌డబ్ల్యూడీఏ అధ్యయనాలూ జలాల లభ్యత తగ్గిందని స్పష్టంచేస్తున్నాయి. అయినా దశాబ్దాల నాటి గణాంకాలతో కేంద్రం హడావుడిగా ముందుకు సాగుతున్నది. బ్రహ్మపుత్ర నుంచి గంగా నదికి, అక్కడినుంచి సుబర్ణరేఖ మీదుగా మహానదికి, ఆపై మహానది నుంచి గోదావరికి, తుదకు గోదావరి నుంచి కావేరికి జలాలను మళ్లిస్తామని ఇంతకాలం చెప్పింది. కానీ, ఇప్పుడు ఆ మాటలన్నీ పక్కనపెట్టి చివరి గోదావరి-కావేరి లింక్‌ను మాత్రమే చేపట్టేందుకు ఆగమేఘాల మీద సిద్ధమవుతున్నది. రాష్ట్రాల అభ్యంతరాలు, డిమాండ్లను తుంగలో తొక్కతూ ఎంవోయూలకు సిద్ధమవుతున్నది. ప్రాణహిత జలాలనే మళ్లించేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా జీబీ (గోదావరి-బనకచర్ల) లింక్ ప్రాజెక్టుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఇంత జరుగుతున్నా తెలంగాణ ప్రభుత్వం ఏమాత్రం పట్టనట్టు వ్యవహరిస్తుండటంపై నీటి రంగనిపుణులు మండిపడుతున్నారు.

మొదలు వదిలి..

వృథాగా సముద్రంపాలయ్యే నదీజలాలను తీవ్ర దుర్భిక్షంతో అల్లాడుతున్న ప్రాంతాలకు మళ్లించి సస్యశ్యామలం చేయాలన్నదే నదుల అనుసంధాన ప్రాజెక్టు లక్ష్యం. ఆశయం గొప్పదే అయినా ఎలాంటి ప్రణాళికలు లేకుండా, కేంద్రం ఇష్టానుసారం ముందుకు సాగుతుంటడమే అందోళనకరం. నదుల అనుసంధానం చేపట్టాలనే ఆలోచనను దశాబ్దాల క్రితం నుంచి చేసినా 2002లో నాటి ఎన్డీఏ ప్రభుత్వం అడుగులు వేసింది. రివర్ లింకింగ్ ప్రాజెక్టుల కోసం 2003లో ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది. హిమాలయ, ద్వీపకల్ప నదుల్లో మొత్తంగా 30 నదులను అనుసంధానించేందుకు ప్రణాళికలు రూపొందించింది. అందులో మహానది-గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి నదుల అనుసంధానం ఒకటి. ఫేజ్-1లో భాగంగా తొలుత వేలాది టీఎంసీల జలాలు అందుబాటులో ఉన్న బ్రహ్మపుత్ర నదీ జలాలను గంగా నదికి మళ్లించాలి. అక్కడినుంచి దామోదర్, సుబర్ణరేఖ నదుల మీదుగా దాదాపు 390 టీఎంసీల జలాలను మహానదికి మళ్లించాలి. ఒడిశా నీటి అవసరాలు తీరిపోయిన తర్వాత ఫేజ్-2లో భాగంగా మహానది నుంచి దాదాపు 230 టీఎంసీల జలాలను గోదావరికి మళ్లించాలి. చివరగా ఫేజ్-3లో భాగంగా గోదావరి నుంచి జలాలను కృష్ణాకు, ఆపై పెన్నా-కావేరి నదులకు మళ్లించాలి. ఇదీ వాస్తవ ప్రణాళిక. కానీ కేంద్రం ప్రస్తుతం ఫేజ్-1, ఫేజ్-2 ఊసే ఎత్తడం లేదు. ఫేజ్-3లో భాగంగా గోదావరి-కావేరి లింక్‌పైనే ముమ్మర కసరత్తు చేస్తున్నది. త్వరలోనే తుది సమావేశాన్ని నిర్వహించి రాష్ట్రాలతో ఎంవోయూలను కుదుర్చుతామంటూ ఇటీవల కేంద్రమే వెల్లడించింది.

ప్రాణహిత జలాలపైనే కన్ను..!

కేంద్ర ప్రభుత్వం ప్రాణహిత జలాలను తరలించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నదని నీటిరంగ నిపుణులు వివరిస్తున్నారు. అందులో భాగంగానే తొలుత గోదావరి-కృష్ణా-పెన్నా-కావేరి ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమైందని చెప్తున్నారు. ఆ ప్రాజెక్టులో భాగంగా మహానది నుంచి 234 టీఎంసీలు, గోదావరి నుంచి 324 టీఎంసీలను మళ్లించాలని తొలుత ప్రణాళికలను రూపొందించారు. అయితే మిగుల జలాల తరలింపునకు ఎట్టిపరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని ఒడిశా ఇప్పటికే స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టును గోదావరి నుంచి చేపట్టాలని కేంద్రం నిర్ణయించినట్టు తెలుస్తున్నది. 1989 వాటర్ బ్యాలెన్స్ స్టడీ రిపోర్టు ప్రకారం ఇచ్చంపల్లి వద్ద 718 టీఎంసీల మిగులు జలాలు ఉన్నాయని ఎన్‌డబ్ల్యూడీఏ చెప్తున్నది. 2004-05 అధ్యయనం సైతం ఇవే లెక్కలు వెల్లడించింది. అయితే, 2015లో ఎన్‌డబ్ల్యూడీఏ వెల్లడించిన నివేదిక మాత్రం ఎస్సారెస్పీ నుంచి ఇచ్చంపల్లి వరకు 177 టీఎంసీలు, ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 148 టీఎంసీలు మొత్తంగా 324 టీఎంసీలే మిగులు ఉంటాయని తేల్చింది. ఎన్‌డబ్ల్యూడీఏ చేసిన ప్రతిపాదనలకు బేసిన్‌లోని రాష్ట్రాలన్నీ కొట్టిపారేశాయి. మిగులు జలాలు ఉండబోవని స్పష్టంచేశాయి. అయినప్పటికీ నీటిలభ్యతపై ఎలాంటి అధ్యయనం చేయించకుండా కేంద్రం మరో ఎత్తుగడ వేసింది. ప్రాణహితలో ఛత్తీస్‌గఢ్ వినియోగించుకోని 148 టీఎంసీలను తొలిదశలో కావేరికి మళ్లిస్తామంటూ కొత్తపాట అందుకున్నది. రాష్ట్రాల అభ్యంతరాలను పట్టించుకోకుండా ఏకపక్షంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తూ యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు సిద్ధమవుతున్నది. ఇరిగేషన్‌కు సంబంధించి రీ జనరేటెడ్ వాటర్‌ను ఎక్కడా పరిగణనలోకి తీసుకోకూడదంటూ సీడబ్ల్యూసీ నిర్దేశిస్తున్నది. కానీ, అందుకు విరుద్ధంగా రీ జనరేటెడ్ వాటర్ ఆధారంగా జీసీ లింక్‌ను చేపట్టేందుకు కేంద్రం సిద్ధమవుతుండటం నిబంధనలను తుంగలో తొక్కుతున్న తీరుకు నిదర్శనం.

తెలంగాణ నీటి హక్కులను కాలరాస్తూ..

గోదావరి నీటి లభ్యత గణాంకాల ఆధారంగా బచావత్ ట్రిబ్యునల్ ఇప్పటికే బేసిన్‌లోని రాష్ట్రాలకు పంపిణీ చేసింది. శాస్త్రీయమైన పద్ధతిలో, సబ్‌బేసిన్‌ల వారీగా ఆయా నదుల్లోని మిగుల జలాల గణాంకాలను సేకరించకుండా కేంద్రం ముందుకుపోతున్నది. గోదావరి బేసిన్‌లోని తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లోనూ దుర్భిక్ష ప్రాంతాలున్నాయి. వాటి నీటి అవసరాలు తీర్చకుండానే, మరో బేసిన్‌కు నీటిని తరలించాలని కేంద్రం పూనుకోవడంపై నీటిరంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. భవిష్యత్‌లో బేసిన్‌లోని రాష్ట్రాలకు, బేసిన్ వెలుపలి రాష్ట్రాలకు మధ్య నీటి వివాదాలకు ఆజ్యం పోస్తుందని, అందుకు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వినియోగంలో తలెత్తుతున్న వివాదాలనే ఉదాహరణగా చూపుతున్నారు. గోదావరిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాటా 1,480 టీ ఎంసీలు. అందులో తెలంగాణ వాటా 968 టీఎంసీలు. ఏపీ వాటా 512 టీఎంసీలు. ట్రిబ్యునల్ కల్పించిన నీటి హక్కులకు ఎక్కడా భంగం వాటిల్లకూడదు. ట్రిబ్యునల్ కల్పించిన హక్కులకు రక్షణ కల్పించాల్సి ఉన్నది. కానీ, ఇప్పటికీ తెలంగాణకు సంబంధించి సమ్మక్కసాగర్, సీతారామ తదితర ప్రాజెక్టుల డీపీఆర్‌లను క్లియర్ చేయకుండానే కేంద్రం జలాల మళ్లింపునకు పూనుకుంటున్నది. ప్రాజెక్టును సమ్మక్కసాగర్ నుంచి, లేదంటే ఇచ్చంపల్లి నుంచి చేపడతామంటూ పలువిధాలుగా ప్రకటించింది. ఈ అంశంపై ఎలాంటి స్పష్టత లేదు. సమక్కసాగర్ దిగువన తెలంగాణకు దాదాపు 150 టీఎంసీల వినియోగాలున్నా యి. ఒకవేళ సమ్మక్కసాగర్ నుంచి జలాలను తరలిస్తే తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయి. ఇదిలా ఉంటే జీసీ లింక్ ద్వారా 148 టీఎంసీలను మళ్లించాలనేది ప్రతిపాదన. అయితే ఆ జలాలకు తెలంగాణ వాటాను 27 శాతానికి పరిమితం చేసింది. కానీ, ఇంద్రావతి, దిగువ ఉప-బేసిన్లలో లేని కర్ణాటక రాష్ట్రానికి 16 టీఎంసీలను ఎన్‌డబ్ల్యూడీఏ ప్రతిపాదించింది. అది ఇటు గోదావరి మాత్రమే కాదు కృష్ణా నది నుంచి తెలంగాణకు వచ్చే ప్రవాహాలపై తీవ్రంగా ప్రభావం చూపే అవకాశం ఉన్నది.

రాష్ట్రాలతో ఒప్పందాలకు కేంద్రం సిద్ధం

జీసీ లింక్‌పై బేసిన్‌లోని ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఏపీ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలతో ఒప్పందాలను కుదిర్చేందుకు కేంద్రం ముమ్మరంగా కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే తమిళనాడు, కేరళ రాష్ట్రాలు సంతకాలు చేసినట్టు సమాచారం. ఇటీవల జీసీ రివర్ లింక్ ప్రాజెక్టుపై ఎన్‌డబ్ల్యూడీఏ ఢిల్లీ నుంచి హైబ్రిడ్‌మోడ్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఆ సందర్భంగానే ఆయా రాష్ట్రాల ప్రతిపాదనలపై కే